
ప్రజాశక్తి

ఆదివారం 26 అక్టోబర్ 2025 | 5 | విజయనగరం



జిఎంఆర్‌లో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పరిధిలో పి4 సర్వే ద్వారా గుర్తించిన బంగారు కుటుంబాలలో చదువుకున్న వారికి జిఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషన్, కంప్యూటర్ టేలీ, డిటిపి, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, హౌస్ వైరింగ్, ఫోటోగ్రఫీ, వీడియో గ్రఫీ, కార్ డ్రైవింగ్, సెల్ ఫోన్ స్ మరమ్మతులు, టైలరింగ్ వంటి వాటిలో 45 రోజులు పాటు శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. ఉచిత భోజన, వసతి సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. నగరంలో ఉన్న మహిళ అభ్యర్థులకు రాజాంలో నిర్వహించనున్న శిక్షణ శిబిరంలో వివిధ అంశాలలో శిక్షణ ఇస్తారని తెలిపారు. వీరికి కూడా రాజాంలో వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆయా సచివాలయాల వద్దకు వెళ్లి వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు.

దూసుకొస్తున్న మొంథా



- తీరంలో హై అలర్ట్
- మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు
- జిల్లా యంత్రాంగం అప్రమత్తం : కలెక్టర్
- అధికారులు సెలవులు రద్దు

ప్రజాశక్తి-పూసపాటిరేగ, భోగాపురం, విజయనగరంకోట, కంటోన్మెంట్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడి తీవ్ర తుపాను 'మొంథా' మారినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ తుపాను ప్రస్తుతం పశ్చిమ-ఉత్తర దిశగా కదులుతూ, విశాఖపట్నం –ఒడిశా మధ్య తీరంలో రాబోయే రెండు రోజుల్లో తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లా తీర ప్రాంత మండలాల్లో ఆందోళన వాతావరణం నెలకొంది. తీరం దాటే సమయంలో గంటకు 90 నుండి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తుపాను ప్రభావంతో ఆదివారం నుంచి నాలుగు రోజులు పాటు బలమైన గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో అధికారులు హైఅలెర్ట్ ప్రకటించినట్లు తహశీల్దార్ ఎన్వి రమణ తెలిపారు.

తుపాను నేపథ్యంలో జిల్లా పరిపాలన యంత్రాంగం అప్రమత్తమైంది. మొంథా తుపాను కాకినాడ, విశాఖపట్నం మధ్య తీరం దాటే సందర్భంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. గ్రామస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని, ఎలాంటి ప్రమాద పరిస్థితులు తలెత్తినా వెంటనే పై అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశాలు జారీచేశారు. మత్స్యకారులెవరూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని సూచించారు. ఈమేరకు అధికారులకు సూచనలు చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్, నీటి సరఫరా, అత్యవసర సేవలు, రక్షణ సిబ్బంది సిద్ధంగా ఉంచాలని తెలిపారు. శనివారం రెండు విడతలుగా నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ లో కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ శాఖలు ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షం అంచనాలను బట్టి రిజర్వాయర్ల నిల్వ స్థాయిలను పర్యవేక్షించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ రైతులకు పంట పరిరక్షణ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పౌర సరఫరాల శాఖ అవసరమైన బియ్యం, నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్ నిల్వలను తగిన చోట్ల సిద్ధంగా ఉంచాలని, ఆర్‌డబ్ల్యుఎస్, మున్సిపాలిటీ శాఖలు తాగునీటి ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్తు శాఖ హై అలర్ట్‌లో ఉండాలన్నారు. కలెక్టర్ కార్యాలయం, ఆర్డీఓ, మున్సిపాలిటీలు, తహశీల్దార్ కార్యాలయాలు, విద్యుత్, అగ్నిమాపక శాఖల్లో 24/7 కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపాలిటీలు, మండలాలులో లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడ అవసరమైన పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తగిన ఆహారం, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. వరదలు సంభవించే అవకాశం ఉన్న చెరువులు, నదులు వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రవాహ ప్రాంతాలలో సంచరించరాదని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు కంట్రోల్ రూమ్ లు సిద్ధం చేసుకుని పవర్ కట్ ఏర్పడితే వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. సెలవుల్లో ఉన్న అధికారులు సెలవులు రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రకటించారు.

తుపాను కంట్రోల్ రూముల వివరాలు

కలెక్టర్ ఆఫీస్ : 08922-236947, 8523876706
విజయనగరం ఆర్‌డిఒ కార్యాలయం : 8885893515
చీపురుపల్లి ఆర్‌డిఒ కార్యాలయం : 9704995807
బొబ్బిలి ఆర్‌డిఒ కార్యాలయం : 9989369511
విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ : 9849906486
ఏపిఇపిడిసిఎల్: 9490610102, టోల్ ఫ్రీ నెంబర్: 1912

తుపాను పట్ల అప్రమత్తం : కమిషనర్

విజయనగరంటౌన్ : తుపాను నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ నుండి విశాఖపట్నం వరకు ఉన్న ప్రాంతంలో ఎక్కడైనా తుపాను తీరం దాటే సూచనలు ఉన్నాయని వాతావరణశాఖ స్పష్టం చేసిందన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసామన్నారు. తుపాను కారణంగా ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లయితే కాల్ సెంటర్ నెంబర్ 98499 06486 కు ఫోన్ చేయాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాను వల్ల ఇబ్బందికి గురైతే తక్షణం దగ్గరలో ఉన్న పాఠశాలలు, కాలేజీల ప్రాంతాలకు పునరావాసానికై చేరుకోవాలని అన్నారు. సహాయక చర్యలు అందించేందుకు, ఇతర అత్యవసర సేవల నిమిత్తం సిబ్బందికి సెలవులను రద్దు చేసినట్లు చెప్పారు.

దెబ్బతిన్న పంటలు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పత్తి పంట తీవ్రంగా దెబ్బతింది. రోజుల తరబడి వర్షపునీరు నిలువ ఉండటంతో పత్తి పూత తడిసి, కాయలు రాలిపోయి కుళ్లిపోతున్నాయి. మండలంలో ఎస్.బూర్జవలస, చౌదంతివలస, కోరప కొత్తవలస, తదితర గ్రామాల్లో ఎక్కువగా పత్తి సాగు చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో దెబ్బతిన్న పంటను చూసి రైతులు రోదిస్తున్నారు. పత్తి విత్తనాలు, ఎరువులు, పురుగుల మందు, ట్రాక్టర్ల దుప్పులు, కలుపు తీసేందుకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టామని, పంట చేతికందే సమయంలో వర్షం దెబ్బతీసిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.



దత్తిరాజేరు.. పత్తి పొలంలో చేరిన నీరు

నేలకొరిగిన వరిచేను

వేపాడ : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలో వరిచేను నేలపాలవుతోంది. పంట చేతికందే దశలో వరిచేను నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏమాత్రం వర్షం అధికంగా కురిసినా, ఈదురుగాలులు వీచినా పంటంతా నేలపాలు కావడం ఖాయమని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



వేపాడ.. వల్లంపూడిలో నేలకొరిగిన వరిచేను

సమ న్యాయం అందరి హక్కు

- డిఎల్ఎస్ఎ సేవలను వినియోగించుకోవాలి : జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత
- టోల్‌ఫ్రీ నెం 15100 ద్వారా ఉచిత న్యాయ సహాయం : కలెక్టర్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

సమ న్యాయం పొందడం అందరికీ మన రాజ్యాంగం కల్పించిన హక్కు అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత పేర్కొన్నారు. పేదరికం లేదా ఇతరత్రా కారణాలవల్ల ఏ ఒక్కరు కూడా న్యాయం పొందకుండా ఉండకూడదని ఆమె స్పష్టం చేశారు. ఎస్‌సి, ఎస్‌టిలు, నిరుపేదలు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు తదితర వర్గాలకు చెందిన వారికి ఉచిత న్యాయ సహాయం లేదా సలహాలు పొందే అవకాశాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందిస్తోందని చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా అధికార యంత్రాంగం సంయుక్తంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత మాట్లాడుతూ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఆదాయం రూ.3లక్షలు కంటే తక్కువ ఉన్న బలహీన వర్గాలకు చెందినవారు డిఎల్ఎస్ఎను సంప్రదించవచ్చునని చెప్పారు. ప్రతి ఒక్కరికీ చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించడం ద్వారా, వాటిని ఉల్లంఘించకుండా చూడవచ్చునని జిల్లా న్యాయమూర్తి సూచించారు. జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, డిఎల్ఎస్ఎను నేరుగా సంప్రదించడం ద్వారా లేదా టోల్‌ఫ్రీ నెంబరు 15100కు ఫోన్ చేయడం ద్వారా న్యాయ సహాయాన్ని పొందే అవకాశం ఉందని చెప్పారు. మండల, గ్రామ స్థాయిల్లో కూడా న్యాయ సేవాధికార సంస్థ సేవలపై అవగాహన కల్పించాలని కోరారు. ఎస్‌పి ఎఆర్ దామోదర్ మాట్లాడుతూ, ప్రతి వ్యక్తికీ రాజ్యాంగం కొన్ని హక్కులను కల్పించిందని, వాటికి ఉల్లంఘన కలిగినప్పుడు, పరిరక్షించడానికి వివిధ చట్టాలు ఉన్నాయని చెప్పారు. బాలికలు, మహిళలకు రక్షణ కల్పించే శక్తి యాప్ గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. పోక్సో చట్టం ద్వారా రాష్ట్రంలోనే అత్యధికంగా మన జిల్లాలోనే సుమారు 20 మంది దోషులకు శిక్ష పడిందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ మాట్లాడుతూ, పేదలు, బలహీన వర్గాలకు డిఎల్ఎస్ఎ ద్వారా అందించేందుకు కృషి జరుగుతోందని చెప్పారు. డిఎల్ఎస్ఎ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలు, న్యాయ సహాయాన్ని పొందే మార్గాలను వివరించారు. మిషన్ వాత్సల్య పథకంపై మహిళాభివద్ధి శిశు సంక్షేమశాఖ ప్రచురించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ద్వారా డ్వాక్రా మహిళలకు రూ.30లక్షలు విలువైన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఐసిడిఎస్ పీడీ టి.విమలారాణి, డిఆర్‌డిఎ డిపిఎం ఎం.రవికుమార్, విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమశాఖ ఎడి ఆశయ్య, సైకాలజిస్ట్ డాక్టర్ రాజు, డిఇఒయు.మాణిక్యంనాయుడు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.రవిబాబు, పలువురు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ఫిర్యాదుల పరిష్కారం వేగవంతం

కలెక్టర్ రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఫిర్యాదుల పరిష్కారంలో వేగం, నాణ్యత రెండింటిపైనా అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి సూచించారు. శనివారం పిజిఆర్ ఎస్‌పై టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విభాగం ఎస్ఎల్ఎ గడువు లోపలే ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ఆలస్యంగా పరిష్కరించిన ఫిర్యాదులను రివ్యూ చేసి కారణాలు నమోదు చేయాలని ఆదేశించారు. అత్యధిక ఫిర్యాదులు రెవిన్యూ శాఖలోలోనే ఉన్నందున, వాటిపై ప్రత్యేక మానిటరింగ్ ఉండాలని పేర్కొన్నారు. దాదాపు 44శాతం అసంతృప్తి నమోదవుతుండటంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేస్తూ, అందరు ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, శాఖాధికారులు ఫిర్యాదుదారుల సంతృప్తి మేరకు పరిష్కారం అందించాలన్నారు. నిర్లక్ష్యం కనబరుస్తున్న విభాగాలపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విఐపి ఫిర్యాదుల పరిష్కారం విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. జిందాల్ భూ సమస్యలపై ఆర్‌డిఒ స్థాయిలో పరిశీలన చేయాలని కలెక్టర్ సూచించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారం ప్రభుత్వం ప్రతిష్ఠకు సంబంధించిన అంశంగా గుర్తించి ప్రతి అధికారి దీనిని ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ గుర్తు చేసారు. కార్యక్రమంలో జెసి సేధుమాధవన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి మురళి, ఆర్‌డిఒలు, జిల్లా అధికారులు, తహశీల్దారులు పాల్గొన్నారు.



కాసుల సంపాదనే ధ్యేయంగా పెట్టుకున్న జిల్లాలోని ప్రయివేటు ట్రావెల్స్ యజమానులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. తనిఖీల్లో పట్టుబడుతున్నా అపరాధ రుసుము సైతం చెల్లించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ పలుకుబడి ఉన్న వారే బస్సులను నడుపుతుండడంతో పై నుంచి ఆదేశాలు వస్తే గానీ జిల్లా అధికారులు తనిఖీలకు సాహసించలేకపోతున్నారు. అక్కడక్కడా తనిఖీలు చేస్తున్నా మొక్కుబడిగానే ఉన్నాయి. ట్రావెల్స్ బస్సుల్లో సిటింగ్ ఉన్న చోట స్లీపర్ లను ఏర్పాటు చేస్తూ ప్రజల భద్రతను గాలికొదిలేస్తున్నారు.

ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ బస్సులే ఎక్కువ

జిల్లా కేంద్రంలోని ఎల్ఐసి బిల్డింగ్ వద్ద నుంచి ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రైవేట్ ట్రావెల్ బస్సులు నడుపుతున్నారు. వీటిలో విజయవాడ, గుంటూరు, బెంగళూరు, హైదరాబాదు తదితర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ అయిన పది బస్సులే కాకుండా ఒడిశా, పాండిచ్చేరి, నాగాలాండ్, డయ్యు డామన్ తదితర రాష్ట్రాలకు చెందిన బస్సులు ఎక్కువగా విజయనగరానికి వస్తున్నట్లు తెలుస్తోంది. మన రాష్ట్రంలో ప్రైవేట్ ట్రావెల్ బస్సులకు సీటింగ్‌ను బట్టి ట్యాక్స్‌లు ఎక్కువగా వేయడం వల్ల ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని మన రాష్ట్రాల నుంచి బస్సులను నడుపుతున్నారు.

ప్రయాణికుల భద్రత గాలికేనా?

- ప్రయివేట్ ట్రావెల్స్ ఇష్టారాజ్యం
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలు
- 6 నెలల్లో 30 బస్సులపై కేసులు
- తాజాగా 3 బృందాలుగా తనిఖీలు
- జిల్లా కేంద్రంలో 4 బస్సులు సీజ్
- సీటింగ్‌ను స్లీపర్‌గా మార్చినట్లు వెల్లడి
- కర్నూలు బస్సు ప్రమాదంతో ప్రయాణికుల్లో ఆందోళన



ట్రావెల్ బస్సులో తనిఖీలు చేస్తున్న డిటిసి మణికుమార్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లా నుంచి ఉపాధి, ఉద్యోగ అవసరాలతో పాటు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం, రైళ్లు తగినన్ని లేకపోవడంతో అధిక శాతం మంది బస్సుల పైనే ఆధారపడుతున్నారు. దీంతోపాటు జిల్లాలో వలసలు అధికంగా ఉండడంతో వలస కూలీలు సైతం అధిక సంఖ్యలో బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. ఆర్‌టిసి తగినన్ని బస్సులు నడపలేకపోవడంతో ప్రైవేట్ ట్రావెల్స్ నడుపుతున్న బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో ఏటా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల సంఖ్య పెరుగుతూనే ఉంది. విజయనగరం జిల్లాలో పది ట్రావెల్స్ బస్సులు రిజిస్ట్రేషన్ అయినట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఇవికాకుండా ఇతర ప్రాంతాల నుంచి ఆపరేటింగ్ చేస్తూ నడుస్తున్న బస్సులు 60 వరకు ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు.

విజయనగరం జిల్లా కేంద్రం నుంచి విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు బస్సులు నడుస్తున్నాయి. రోజూ సుమారు 2వందల మంది వరకు ప్రయాణిస్తున్నారు. పండగ సీజన్‌లో ప్రయాణం చేసే వారు వేలల్లోనే ఉంటున్నారు. అయితే ఈ బస్సుల్లో పండగ సీజన్‌లో అధిక ఛార్జీలను వసూలు చేయడం, సరైన పత్రాలు లేకపోవడం, అతి వేగం, ప్రమాదకర డ్రైవింగ్ వంటి అంశాలపై అధికారులు అనేక సందర్భాల్లో కేసులు నమోదు చేస్తూనే ఉన్నారు. బస్సులకు డేంజర్ లైట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు లేకపోవడం వంటి వాటితో పాటు చిన్న చిన్న అంశాలను సైతం యాజమాన్యాలు విస్మరిస్తున్నాయి. అధికారులు చేపడుతున్న తనిఖీల్లో అనేక లోపాలు బయటపడుతున్నాయి. వాటిపై అధికారులు అపరాధ రుసుము విధిస్తున్నా చెల్లించకుండా ఎగవేస్తున్నారు.

జిల్లాలో గత ఆరు నెలల నుంచి ఇప్పటివరకు పలురకాల ఉల్లంఘనలపై 30 కేసులు నమోదు చేశారు. అధికారులు తనిఖీల్లో గుర్తించి లోపాలను యజమాన్యాల దష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. తనిఖీలకు సిబ్బంది కొరత, ప్రజల భద్రత విషయంలో ప్రభుత్వమూ ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలను ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ యజమాన్యాలను కట్టడి చేసేందుకు రవాణాశాఖను పటిష్టం చేయాల్సి ఉండగా, ఆ శాఖకు సరిపడా సిబ్బందిని నియమించడం లేదు.

జిల్లాలో తనిఖీలు

కర్నూలు జిల్లాలో ప్రైవేట్ ట్రావెల్ బస్సు జరిగిన ప్రమాదంతో జిల్లాలో నాలుగు బృందాలుగా రవాణాశాఖ అధికారులు ఏర్పడి శనివారం తనిఖీలు చేపట్టారు. రవాణా శాఖ కమిషనర్ డి.మణికుమార్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఈ తనిఖీలు చేపట్టారు. నాలుగు బస్సుల్లో సీటింగ్‌ను స్లీపర్‌గా మార్చినట్లు గుర్తించి వాటిని సీజ్ చేశారు రాజాపులోవ వద్ద ఒక బృందం, చెల్లూరు వద్ద మరో బృందం తనిఖీలు చేపట్టాయి.

ఫిట్ నెస్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పగింత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల ఫిట్నెస్ లను ప్రైవేటు సంస్థకు అప్పగించింది. ప్రైవేట్ సంస్థలు ప్రజల భద్రతను గాలికొదిలి ఫిట్ నెస్‌ను నిర్వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విజయనగరం జిల్లాలో గుర్ల మండలం అచ్యుతాపురం వద్ద ఈ ఫిట్నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎవరినీ లోపలికి రానీయకుండా ఫిట్‌నెస్‌కు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఆర్‌టిఒ కార్యాలయంలో ఈ ఫిట్నెస్ సెంటర్ గతంలో ఉండేది. తనిఖీలు క్షుణ్ణంగా పరిశీలించి ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇచ్చేవారు. కానీ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలు పాటించని ప్రయివేట్ బస్సులపై కేసులు నమోదు

నిబంధనలు పాటించని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పై ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. బస్సుల్లో సిట్టింగ్ ఏర్పాటు, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ బస్సులో అత్యవసర పరిస్థితులు ద్వారం, లగేజీ పర్మిషన్ తదితర నిబంధనలను పరిశీలించి కేసులు నమోదు చేస్తున్నాం. ప్రైవేట్ ట్రావెల్స్ ఎక్కువ మొత్తంలో టికెట్ రేట్లు పెంచిన సమయంలో తనిఖీలు నిర్వహించి కేసులు పెడుతున్నాం.

- డి.మణికుమార్, రవాణా శాఖ ఉప కమిషనర్, విజయనగరం

సెట్విజ్ సిఇఒగా విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం కోట



యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా వి. విశ్వేశ్వరరావును నియమిస్తూ కలెక్టర్ రామ సుందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో విజయనగరం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేశారు.

26న రోలింగ్ ట్రోఫీ పోటీలు

ప్రజాశకి-విజయనగరం టౌన్

జిల్లా స్థాయి అండర్-15 ఓపెన్ చెస్ జిల్లా స్థాయి స్కూల్స్, కాలేజీల రోలింగ్ ట్రోఫీ ఈనెల 26న జరుగుతుందని చదరంగం జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కె . కె.జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ యూనిఫాంతో విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు. పోటీలతో పాటు భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా జిల్లా చెస్ అసోషి యేషన్ ఆధ్వర్యంలో ఉదయం 8గంటలకు నుంచి చదరంగం పరీక్షలను (చెస్ ఎగ్జామ్స్) నిర్వహిస్తామని పేర్కొన్నారు. దీనికి వయోపరిమితిలేదన్నారు. శ్రీ చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం, ఫైర్‌చెస్ స్కూల్ కలిసి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేర్లు నమోదుకు 741 66 66 567 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

కమిషనర్‌తో కాంట్రాక్టర్ల చర్చలు విఫలం

పోరాటం కొనసాగిస్తామంటున్న కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బకాయి బిల్లుల విషయమై కమిషనర్ నల్లనయ్య కాంట్రాక్టర్ల అసోసియేషన్‌తో శనివారం నిర్వహించిన చర్చలు విఫలమయ్యాయి. ప్రజాశక్తి దినపత్రికల్లో వచ్చిన 'కాంట్రాక్టర్ల పోరుబాట' కథనంతో ఈ కమిషనర్ ఈ చర్చలు ఏర్పాటు ఏశారు. బిల్లులు చెల్లించేందుకు స్పష్టత ఇవ్వకపోవడంతోపాటు, పనులు ఆపేస్తే ఆపేయండి అని చెప్పడంతో చర్చలు విఫలమైనట్లు అసోసియేషన్ ప్రతినిధులు రాజ్ కుమార్, బంగార్రాజు, అశోక్, నరేంద్ర, దువ్వి శ్రీను, మచ్చ సత్యన్నారాయణ మీడియాకు తెలిపారు. పనులు టెండర్లు పిలిచిన నగర పాలక సంస్థ అధికారులు బిల్లులు చెల్లించే విషయంలో సంబంధం లేనట్లు వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. బిల్లులతో పాటు కొన్ని సమస్యలు పరిష్కరించేందుకు సానుకూలమైన ప్రతిపాదనలు కమిషనర్ నుంచి, ఇంజినీరింగ్ అధికారులు నుంచి రాకపోవడంతో పోరాటాన్ని యధాతథంగా కొనసాగిస్తామని కాంట్రాక్టర్లు తెలిపారు. బుధవారం ధర్నా నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద చేస్తామని చెప్పారు.

తొలి నుంచి ప్రయివేటు తోవే

ప్రజాశక్తి -విజయనగరం ప్రతినిధి

పేదల అభ్యున్నతి కోసమే తమ పార్టీ పుట్టిందంటూ చెప్పుకుంటున్న టిడిపి మెడికల్ కళాశాలల విషయంలో తొలి నుంచీ ప్రయివేటు తోవే అవలంభిస్తోంది. వాస్తవానికి జిల్లాలో మెడికల్ కళాశాల ప్రతిపాదన ఈ నాటిది కాదు. రాష్ట్ర విభజన సమయంలో వివిధ ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా నాటి టిడిపి ప్రభుత్వం విజయనగరంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని చెప్పింది. అప్పట్లో జిల్లా టిడిపిలో కీలకంగావున్న నేటి గోవా గవర్నర్ మాన్సాస్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఏర్పాటు చేస్తామంటూ ముందుకు వచ్చారు. ఇలా అయితే ప్రైవేటు పద్ధతిలో ఏర్పాటు చేసినట్టుగా భావించిన సిపిఎం, సిపిఐ, లోక్ సత్తా తీవ్రంగా వ్యతిరేకించాయి. నాడు ప్రతిపక్షంలోవున్న వైసిపి కూడా ఇందుకు అనుగుణంగానే గొంతు కలిపింది. విద్యకోసం ఎన్నో ఆస్తులను త్యాగం చేసిన తన తండ్రి ఏకంగా ఆర్ట్స్, సైన్స్ అభివృద్ధికి ఎన్నో ఇనిస్టిట్యూట్స్ ఏర్పాటు చేశారని, వారి కల నెరవేర్చేందుకు మాన్సాస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేస్తామని ప్రభుత్వాన్ని అశోక్‌గజపతిరాజు అప్పట్లో ఒప్పించారు కూడా. ఈ పేరుతో విజయనగరంలోని డాబాగార్డెన్స్, భీమిలి పరిసర ప్రాంతాల్లోని భూములను ఉడా ఆధ్వర్యాన సుమారు రూ.200కోట్లుకు విక్రయించినట్టు కూడా చాలా మంది చర్చించుకున్నారు. తీరా ఆస్తులు విక్రయించాక కాలేజీ ఏర్పాటుపై చేతులెత్తేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక తొలిదశలోనే విజయనగరంలో వైద్య కళాశాల నిర్మాణానికి నాబార్డు నిధులు మంజూరు చేసింది. ప్రారంభంలో స్థలం గుర్తింపుకోసం కాస్త ఆలస్యం అయినప్పటికీ, శంకుస్థాపన తరువాత పనులు బాగానే ముందుకు సాగాయి. కళాశాల ప్రభుత్వ రంగంలో నిర్మించినప్పటికీ 150సీట్లలో 50శాతం



సెల్ఫ్‌ఫైనాన్స్ సీట్లుగా నిర్ణయించారు. దీంతో, అప్పట్లోనే ఈ కళాశాల సగం ప్రైవేటుగా మారింది. ఇలా ప్రభుత్వ కాలేజీలో ప్రైవేటు సీట్లు ప్రకటించడం పట్ల సిపిఎం, ఎస్‌ఎఫ్ఐ అప్పట్లో తీవ్రంగా తప్పుపట్టాయి. గత ఎన్నికల్లో జిల్లాకు వచ్చిన టిడిపి యువనేత నారా లోకేష్ కూడా తాము అధికారంలోకి వస్తే 100శాతం సీట్లు ప్రభుత్వం రంగంలో ఉంచుతామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక స్వరం మారిపోయింది.

ఏడాదిన్నర క్రితం అధికారంలోకి వచ్చిన టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి పూర్తిగా పిపిపి విధానం పేరిట ప్రైవేటు పరం చేసేందుకు పావులు కదుపుతోంది. దీన్ని వామపక్షాలతోపాటు పలు సంఘాలు, ప్రజా దృక్కోణంగల వైద్యులు వ్యతిరేకిస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. పేదలకు వైద్యం అందాలంటే వైద్య విద్య, ప్రజారోగ్య వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే ఉండాలి. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ జరిగితే పేద విద్యార్థులకు ఉచితంగా వైద్య విద్య అందుబాటులోకి వచ్చే అవకాశం ఉండబోదు. ఫీజులు కట్టుకోలేక వైద్య విద్యకు దూరం అయ్యే అవకాశాలు ఉంటాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇబిసి రిజర్వేషన్లు వర్తించే పరిస్థితి కూడా ఉండబోదు. పేదలకు వైద్య సేవలకు ఖరీదుగా మారుతాయి.

ఈ నేపథ్యంలో పిపిపి విధానం వెనక్కి తీయిసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఇందులో పాల్గొన్న వైద్యులు, వివిధ సంఘాల నాయకులు మెడికల్ కాలేజీ ప్రైవేటీపరం ఆలోచనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అంతకు ముందు నుంచే ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కూడా వ్యతిరేకత తెలిపింది. మెడికల్ కళాశాల అభివృద్ధి పనులను కూడా పరిశీలించారు. సిపిఎం, సిపిఐ తొలి నుంచీ ప్రభుత్వ ఆలోచను ఖండిస్తున్నాయి. తాజాగా వైసిపి నేతలు కూడా దీనిపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 28న మరోసారి నిరసన కార్యక్రమానికి ఆ పార్టీ పిలుపునిచ్చింది.



విద్యార్థులను అభినందిస్తున్న డిఇఒ మాణిక్యం నాయుడు

రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో ప్రథమ స్థానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో సారిపల్లి విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానం సాధించినట్లు జడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మాదేవి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ సారిపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థుల బృందం విజయవాడలో జరిగిన రాష్ట్ర కళా ఉత్సవ్ పోటీల్లో వాయిద్య సంగీతం పోటీల్లో ప్రథమ స్థానం సాధించారన్నారు. వీరు భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, హెచ్‌ఎం పద్మాదేవి, గైడ్ టీచర్ శ్రీనివాసరావు, రవి, డిఇఒ, డైట్ ప్రిన్సిపాల్, స్కూల్ కమిటి చైర్మన్ సారిపల్లి వెంకట్రావు, గ్రామస్థులు అభినందించారు.

నేడు విశాఖ డెయిరీ చైర్మన్, ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-వేపాడ



గొంప వెంకటరావు

మండలంలో ఆదివారం విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందరావు, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పర్యటించనున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. వేపాడ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కంటైనర్ పార్లర్, డిస్ట్రిబ్యూటర్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు చెప్పారు. అనంతరం బల్లంకి గ్రామంలో విశాఖ డెయిరీ, పాల ఉత్పత్తిదారుల సంఘం సొసైటీ నిధులతో నిర్మించిన 15 బోర్లు కూడా ప్రారంభిస్తారని చెప్పారు. ఈ పర్యటనను విజయవంతం చేయాలని వెంకటరావు, బల్లంకి పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు దేగల ఈశ్వరరావు కోరారు.

సురక్ష యాప్‌పై విస్తృతంగా ప్రచారం

ప్రజాశక్తి -బొబ్బిలి

నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు ఎక్సైజ్ శాఖ తీసుకువచ్చిన సురక్ష యాప్‌పై ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు, సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేశారు. పట్టణంలో ఉన్న వైన్ షాపులు, బార్ల వద్ద సురక్ష యాప్ స్టిక్కర్లను అతికించి, యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎక్సైజ్ సురక్ష యాప్‌తో నకిలీ మద్యాన్ని గుర్తించవచ్చని తెలిపారు. మద్యంపై అనుమానం వస్తే సీసాపై ఉన్న బార్ కోడ్‌ను యాప్‌తో స్కాన్ చేయాలని కోరారు. నకిలీ మద్యం నియంత్రణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు.



సంతకాల సేకరణ చేస్తున్న వైసిపి నాయకులు

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-దత్తిరాజేరు

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు దత్తి చిరంజీవి ఆధ్వర్యాన శనివారం మండలంలోని గుచ్చిమి గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టే ఉద్యమానికి ప్రజలంతా మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు కడుబండి రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన మోడల్ స్కూల్ విద్యార్థి

ప్రజాశక్తి-కొత్తవలస

రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని ఎంఆర్‌సిలో ఎంఇఒ ఆధ్వర్యాన నిర్వహించిన పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఎం.జయశ్రీ సత్తాచాటింది. వ్యాసరచన పోటీల్లో జయశ్రీ ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ జి.ప్రసన్నలక్ష్మి తెలిపారు. విద్యార్థినిని స్కూల్ కమిటీ చైర్మన్ మళ్ల రాము, ఉపాధ్యాయులు పి.శివప్రసాద్, గీతాంజలి నాయక్, షేక్ పర్వీన్ బేగం తదితరులు అభినందించారు.



సదస్సులో పాల్గొన్న కళాశాల విద్యార్థులు, సిబ్బంది

బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి-గంట్యాడ

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. రామవరంలోని అంగన్వాడీ కేంద్రంలో ఎస్‌కె డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం బాల్యవివాహాలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం వల్ల శారీరకంగా, మానసికంగా సరైన పెరుగుదల ఉండదని, మాత, శిశు మరణాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. శారీరక, మానసిక అనారోగ్యానికి గురవుతారని చెప్పారు. ఈ సందర్భంగా బాలల హక్కుల సంరక్షణ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్స్, లైంగిక వేధింపులపైనా అవగాహన కలిగించారు. టోల్ ఫ్రీ నెంబర్లు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌కె డిగ్రీ కళాశాల సిబ్బంది సరస్వతి, అంగన్వాడీ కార్యకర్త నాగవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

దాట్ల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని సింగవరం గ్రామంలో విజయనగరం దాట్ల హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 95 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఎమ్‌డి డాక్టర్ దాట్ల శ్రీకాంత్ బాబు మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లోనూ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఫౌండర్ చైర్మన్ దాట్ల సత్యనారాయణ రాజు, సర్పంచ్ ప్రతినిధి అప్పారావు, ఉపసర్పంచ్ గురునాధ్‌రావు నాయకులు సంచాన కృష్ణమూర్తి, శ్యామలరావు పాల్గొన్నారు.



ఆరోగ్య తనిఖీలు చేస్తున్న దాట్ల ఆసుపత్రి వైద్యులు

సహాయ స్ఫూర్తి.. భావితరాలకు మార్గదర్శి

పేదలకు, విద్యార్థులకు అండగా నిలుస్తోన్న సంస్థ

ప్రజాశక్తి - గజపతినగరం

యువత తలచుకుంటే ఏదైనా సాధ్యమే. ఇదే స్ఫూర్తిని నింపుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తోంది సహాయ స్ఫూర్తి ఫౌండేషన్. గర్భిణులకు, రోగులకు నేనున్నా అనే భరోసాను కల్పిస్తోంది. వందకు పైగా రక్తదాన శిబిరాలు నిర్వహించింది. వందల సంఖ్యలో ఉచిత నేత్ర, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. వృద్ధులకు కంటిచూపును ప్రసాదించేందుకు సాయపడుతోంది. సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్‌ను స్థాపించిన ఎస్.వై.వి.సాయికుమార్, మిత్తిరెడ్డి సాయి రేవంత్.. నేటి తరానికి ఆదర్శం, భావితరాలకు మార్గదర్శులని చెప్పడంలో ఎలాంటి సందేహమూ లేదు.

గజపతినగరానికి చెందిన యువకులు సాయి కుమార్, రేవంత్ స్నేహితులు. సమాజానికి సేవ చేయాలని సంకల్పంతో 2016లో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. పేరుకు తగ్గట్టుగానే పేదలకు, వృద్ధులకు, గిరిజన ప్రాంతాల ప్రజలకు కొండంత అండగా నిలుస్తూ సహాయం చేస్తోంది. గజపతినగరం, మెంటాడ, దత్తిరాజేరు, బొండపల్లి మండలాల్లో అనేక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గత పదేళ్ల నుంచి ప్రతి మూడు నెలలకు ఒకసారి ఫౌండేషన్ ద్వారా యువతకు రక్తదాన ఆవశ్యకతను వివరిస్తూ, అవగాహన కల్పిస్తున్నారు. వారిని చైతన్యం చేస్తూ 100కు పైగా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. దాదాపు 2 వేల మంది నుంచి రక్తాన్ని సేకరించారు. గ్రామాల్లో కంటి చూపు సమస్యలున్న పేద,



సహాయస్ఫూర్తి ఫౌండేషన్ ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న సాయికుమార్, రేవంత్

మధ్యతరగతి వృద్ధుల కోసం 150కు పైగా నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రముఖ వైద్యులతో వారికి పరీక్షలు చేయించి, దాదాపు 2400 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి శస్త్రచికిత్సలు చేసి వెలుగునిచ్చారు. ఏటా వినాయక ఉత్సవాల సమయాల్లో నీటి కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా వెయ్యికి పైగా మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్నారుక. మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షిద్దామనే నినాదంతో అవగాహన కల్పిస్తున్నారు. కొంతమంది ఫౌండేషన్ సభ్యులు పుట్టినరోజులు జరుపుకునే సమయంలో అనాథ పిల్లలు, వృద్ధులకు ఆయా ఆశ్రమాల్లో అన్నదానాలు ఏర్పాటు చేస్తున్నారు. అంగన్వాడీ చిన్నారులు, ప్రాథమిక పాఠశాలల



విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

విద్యార్థులకు కుర్చీలు, బ్యాగులు, స్టేషనరీ వస్తువులు వితరణ చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అగ్నిప్రమాదాలలో సర్వం కోల్పోయిన బాధితులకు మేమున్నాం అనే భరోసానిస్తూ ఫౌండేషన్ సభ్యుల సహాయంతో నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేస్తున్నారు. బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్చాలని సదుద్దేశంతో పేదరికంతో చదువుకు దూరమైపోతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు సాయంగా నిలుస్తూ, పిల్లలను బడికి పంపే ఏర్పాట్లు చేస్తున్నారు.

స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 78 ఏళ్లు గడిచినా దత్తిరాజేరు మండలం రాజుల రామచంద్రపురం పంచాయతీ పరిధిలో ఉన్న ఎస్‌టి కొత్తవలస గిరిజన గ్రామానికి విద్యుత్తు సౌకర్యం లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు సోలార్ కలెక్షన్లు ఏర్పాటు చేసి గిరిజన ప్రజలకు వెలుగులు ఇచ్చారు.

విజయవాడను వరదల రూపంలో అతలాకుతలం చేసిన నేపథ్యంలో సహాయస్ఫూర్తి సభ్యులు ప్రత్యేకంగా విజయవాడ వెళ్లి సహాయ కార్యక్రమాలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాలకు వెళ్లి వారికి నిత్యావసర సరుకులు, మందులు అందజేశారు. కొంతమంది పేదలకు ఆర్థిక సహాయం చేశారు.

ఎన్నో ప్రశంసలు

కష్టకాలంలో అండగా నిలుస్తున్న సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు ఎంతో మంది నుంచి ప్రశంసలు పొందారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ప్రతి సంవత్సరం నిర్వహించే ఫౌండర్స్ డే కార్యక్రమంలో 2024, 2025 కాలంలో అత్యధికంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, ఎక్కువ సర్జరీలు చేయించినందుకు గాను బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు అందజేసింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా బ్లడ్ బ్యాంకులు ప్రత్యేకంగా సంస్థ సభ్యులను సన్మానిస్తున్నాయి.

సాయం చేయడమే లక్ష్యం



పేదలకు సాయం చేయడమే లక్ష్యంగా సంస్థను ఏర్పాటు చేశాం. ఆర్థిక ఇబ్బందులతో పేద విద్యార్థులకు విద్య దూరం కాకూడదు. అందుకే ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయం చేస్తున్నాం. త్వరలో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు విద్యపరంగా ఉచితంగా, అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం. మహిళలకు, గర్భిణులకు, ఇతర వ్యాధిగ్రస్తులకు, రక్తహీనత కలిగినవారికి, ప్రమాదాల్లో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం అందజేయడం మా ఉద్దేశం. వృద్ధులకు, పేద ప్రజలకు కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన వారికి ఫౌండేషన్ తరపున ఉచిత వైద్యం అందిస్తున్నాం.

– ఎస్‌వైవి సాయికుమార్, రేవంత్,
సహాయస్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

రూ.66.36 కోట్లతో అమృత్ 2.0 అమలు

పబ్లిక్ హెల్త్ సిఇ ప్రభాకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా రూ.66.36కోట్లతో అమృత్ 2.0 పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.ప్రభాకర్ రావు స్పష్టం చేశారు. శనివారం ముషిడిపల్లి, మధుపాడ వాటర్ వర్క్స్ వద్ద ఆయన అమృత 2.0 ప్రతిపాదిత అంశాలను సమీక్షించారు. నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న నీటి సరఫరా ప్రక్రియను తనిఖీ చేశారు. గతంలో చేపట్టిన పథకాల అమలు తీరును గమనించారు. ప్రస్తుతం 66.36 కోట్ల రూపాయలతో అమృత్ 2.0 పథకం కింద నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని, ప్రతిపాదిత అంశాలకు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. అయితే సాంకేతిక ఆమోదం లభించాల్సి ఉందని చెప్పారు. అన్ని ప్రక్రియలు పూర్తిచేసి ప్రజలకు అవసరమైన తాగునీటి సరఫరాను సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 10



అధికారులతో మాట్లాడుతున్న పబ్లిక్ హెల్త్ సిఇ ప్రభాకరరావు

ఎంఎల్‌డి జలాల అభివృద్ధి విధానాన్ని పరిశీలించామన్నారు. 600 ఎంఎం గ్రావిటీ మెయిన్ లైన్ మార్పు, ఇతర పనులను ప్రతిపాదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్‌ఇ ఇంజనీర్ పి. కామేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జ్యోతి, కార్పొరేషన్ ఈఈ ప్రసాద్, డిఇలు శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కంచమ్మ తల్లి జాతర

ప్రజాశక్తి- మెరకముడిదాం



జాతరకు పోటెత్తిన జనం

మండలంలో కొండలావేరు, పరిసర గ్రామాల ఇలవేల్పు కంచమ్మ తల్లి జాతర నాగుల చవితి సందర్భంగా ఏటా ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శనివారం నాగుల చవితి రోజున బోడి కొండపైన ఉన్న కంచమ్మ తల్లిను వేలాది మంది యాత్రికుల దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. యాత్రికలకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా బుధరాయ వలస ఎస్‌ఐ జై లోకేష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 300 సంవత్సరాల క్రితం నుండి కంచమ్మ జాతర మహోత్సవాలు జరుగుతుండడం ఆనవాయితీగా వస్తోంది. కొండపై తాగటానికి మంచినీరు ఏర్పాటు చేయడం వల్ల యాత్రికలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక వైసిపి నాయకులు సిరిపూరి రమణరాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఒక్క మండలంలోని కాక పరిసర మండలాల నుండి వేలాది మంది యాత్రికలు తరలివచ్చి పెద్ద, చిన్న కంచమ్మ తల్లులను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కంచమ్మతల్లిని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు దర్శించుకున్నారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారిశుధ్య పనుల్లో అలసత్వాన్ని ప్రదర్శిస్తే సహించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. శనివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నగరంలో పలుచోట్ల ఆయన పారిశుధ్య విధానాన్ని పరిశీలించారు. సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. రహదారులపై చెత్తలు, భవన నిర్మాణ వ్యర్థాలుగాని ఉన్నట్లయితే సంబంధిత శానిటరీ సెక్రటరీని బాధ్యులుగా చేస్తామని అన్నారు. కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికలు తొలగించే విధంగా చూడాలన్నారు. అక్కడక్కడ ఉన్న డస్ట్ బిన్లను ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేసి చుట్టూ బ్లీచింగ్ పౌడర్ ను వేయాలని సూచించారు. వర్షాలు కురిసే సమయంలో డస్ట్ బిన్ల వద్ద దుర్గంధ వాతావరణం వెదజల్లే అవకాశం ఉందన్నారు. అందువల్ల సంపూర్ణ పారిశుధ్య విధానాలను అమలు చేయాలన్నారు. నిర్ణీత సమయంలో పారిశుధ్య సిబ్బంది విధులకు హాజరవుతున్నారా లేదా అన్నది అనునిత్యం పరిశీలించాలని పారిశుధ్య పర్యవేక్షకులకు ఆదేశించారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

వసూళ్ల రాజాపై ఫిర్యాదు

విధులు నిర్వర్తించనీయకుండా ఆటంక పరుస్తున్నాడని ఆవేదన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ శాఖల అధికారులను, దిగువస్థాయి సిబ్బందిని ఆర్‌టిఐ, తప్పుడు పిజిఆర్‌ఎస్ ఫిర్యాదులతో బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడుతూ విధులకఆటంకం కలిగిస్తున్న లక్కవరపుకోట మండలంలోని కాసాపేట గ్రామానికి చెందిన కోటాన ఎర్రి నాయుడుపై జిల్లా కలెక్టర్ రామసుందర్ రెడ్డికి పలువురు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎస్‌పి ఆదేశానుసారం మండలంలోని కొట్టం పిహెచ్‌సి వైద్యాధికారులు , సిబ్బంది శనివారం ఎస్.కోట, ఎల్. కోట పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ. సుమారు మూడేళ్ల నుంచి ఆర్‌టి యాక్ట్ ద్వారా ఇబ్బందులు పెడుతున్నాడని, అతను అడిగిన సమాచారం ఇచ్చినప్పటికీ దురుసుగా ప్రవర్తిస్తూ దూరంగా ట్రాన్స్‌ఫర్ చేయిస్తానంటూ బెదిరింపులకు దిగుతుండడంపై అతని వేధింపులు తాళలేక శనివారం ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇటీవల జిల్లా అధికారి సమక్షంలోనే వైద్య సిబ్బందిని ఆ వ్యక్తి ఇష్టం వచ్చిన బూతులు తిట్టాడని, అయినా జిల్లా అధికారి పన్నెత్తు కూడా మాట అనకపోవడంపై తామంతా మనస్థాపం చెందినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో కొట్టాం పిహెచ్‌సి వైద్యులు జె.హారిక, లావణ్య, సిహెచ్‌ఒ కె.వేణుగోపాలరావు, యుడిసి కె.నాగమణి, సిబ్బంది ఉన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైద్యాధికారులు

తేనెటీగల దాడిలో 50 మందికి గాయాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో తేనే టీగల దాడిలో 50 మందికి గాయాలయ్యాయి. శనివారం స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. నాగుల చవితి సందర్భంగా విశ్వంబర స్కూల్ వద్ద పుట్టలో పాలు వేయడానికి కొంత మంది వెళ్లి బాణసంచా కాల్చారు. దీంతో చెట్టు మీద తేనే టీగలు ఒక్కసారిగా ప్రజలపై దాడి చేసాయి. ఈ దాడిలో 50మందికి పైగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో స్థానికులు, సిహెచ్‌సి అభివృద్ధి కమిటి సభ్యులు మజ్జి రాంబాబు స్పందించి సామాజిక ఆసుపత్రికి తరలించారు. క్షత గాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

తుప్పలను తొలగించిన పోలీసులు

ప్రజాశక్తి - డెంకాడ

ప్రమాదాల నివారణలో భాగంగా మండలంలోని విజయనగరం నాతవలస రహదారిలో రోడ్లకి ఇరువైపులా ఉన్న తుప్పులు, పిచ్చి మొక్కలను స్థానిక ఎస్‌ఐ ఏ.సన్యాసినాయుడు జెసిబితో శనివారం తొలగించారు. పిచ్చి మొక్కలు, తుప్పలు రోడ్డుపైకి పెరిగి పోవడంతో ప్రయాణికులకు రోడ్డు కనిపించ ప్రమాదాలు జరుగుతున్నాయని అందుకే తన సిబ్బందితో రోడ్డుకి ఇరువైపులా ఉన్న తుప్పలను మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించామని ఎస్‌ఐ తెలిపారు. స్టాపర్స్ ఏర్పాటు చేసి స్పీడ్ బ్రేకర్లు రోడ్లపై వేయిస్తామని చెప్పారు. ప్రయాణికులు కూడా జాగ్రత్తలు వహించి ప్రయాణించాలని సూచించారు. అనంతరం పెద్దడివాడ జంక్షన్ నుండి నాతవలస వరకు రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు.

జెఎన్‌టియులో అధికారులకు రెండు వారాల శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు జివి ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్'పై రెండు వారాలు పాటు ప్రభుత్వ అధికారులకు ఈనెల 27 నుంచి నవంబర్ 7వరకు శిక్షణ జరుగుతుందని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వివి సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ విభాగాలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్‌లు, స్వయంప్రతిపత్తి సంస్థలకు చెందిన 80 కంటే ఎక్కువమంది ప్రభుత్వ అధికారులు శిక్షణకు మోదు చేసుకున్నారని తెలిపారు. చివరి రెండు రోజులు జెఎన్‌టియుజివి క్యాంపస్‌లో ప్రత్యేక శిక్షణా తరగతులు జరుగుతాయని తెలిపారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

నగరంలోని కంటోన్మెంట్ రెల్లి విధి చెందిన మహేందర్ బాలికపై పూల్‌బాగ్ కాలనీకి చెందిన బాలుడు లైంగికంగా దాడి చేయడంపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సిఐ ఆర్‌విఆర్‌కె చౌదరి తెలిపారు.బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

27న బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్ పోటీలకు జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 27న కొత్తవలసలోని జిందాల్ భారతి స్కూల్లో స్కూల్ గేమ్స్ 14 ,17 బాస్కెట్ బాల్ ఎంపికలు, విజయనగరం లో ఉన్న స్విమ్మింగ్ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సిమ్మింగ్ అండర్ 14, 17 ఎంపికలు జరుగుతాయని స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

సంతకాల సేకరణలో పాల్గొనండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కోటి సంతకాలు సేకరణ విజయవంతం చేయాలని వైసిపి కార్మిక విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ధవల లక్ష్మణరావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు గౌతమ్ రెడ్డి సూచనలు ప్రకారం వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో తలపెట్టిన కోటి సంతకాల ఉద్యమంలో భాగంగా వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కోటి సంతకాల ఉద్యమంలో పాల్గొనాలని కార్మిక వర్గానికి పిలుపు నిచ్చారు.

అనాథకు జనసేన ఆర్థిక సాయం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని గుండాలపేట గ్రామంలో ఈ మధ్యనే తల్లిదండ్రులను కోల్పోయి అనాధగా ఉన్న దేవాన్సికకు ఆ గ్రామానికి చెందిన జనసేన నాయకులు కాళ్ళ స్వామి ఆధ్వర్యంలో శనివారం లక్ష వెయ్యి రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగాస్వామి మాట్లాడుతూ పాప తల్లిదండ్రులది నెల్లిమర్ల మండలంలో జరజాపుపేట గ్రామం కాగా ఇటీవల ఆగ్రామంలో వారు అనారోగ్యంతో ఒకరి తర్వాత ఒకరు చనిపోయారన్నారు. అక్కడ దేవాన్సికను చూసుకునేవారు లేకపోవడంతో గుండాలపేటలో ఉంటున్న పాప తాత, అమ్మమ్మ ఇక్కడకు తీసుకొచ్చారని చెప్పారు. వారికి కూడా పోషించే స్తోమత లేకపోవడంతో పాటు వృద్ధాప్యంతో ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారని దీంతో గ్రామ జనసేన నాయకులు అందరం కలిసి ఆర్థిక సహాయం చేశామని చెప్పారు. ఎమ్మెల్యే కూడా ఆర్థిక సాయం చేస్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నామాల నాగరాజు, నామాల దుర్గారావు, బుగత సాయి, ఎన్నింటి శ్రీను, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

'ప్యారి'.. జల కాలుష్యం పట్టదా మరి?

- చక్కెర పరిశ్రమపై పిజిఆర్‌ఎస్‌కు మాజీ సర్పంచ్ ఫిర్యాదు
- షుగర్స్ జల కాలుష్యంపై విచారణ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి ఈఐడి ప్యారి షుగర్స్‌కు జల కాలుష్యం పట్టదా అని అప్పాపురం గ్రామ మాజీ సర్పంచ్, రైతు పల్ల వెంకటరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవుదల పంచాయతీ రెవెన్యూ గ్రామంలో వంకాయల వాని కోనేరు వద్ద 10 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నామని, అయితే సుగర్స్ నుంచి వచ్చే వ్యర్థ రసాయనిక జల కాలుష్యంతో తమ పంటలు పూర్తిగా నాశనం అవుతున్నాయని, భూసారం తగ్గి పంటలు పోతున్నాయని పిజిఆర్‌ఎస్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు శనివారం విజయనగరం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ ఆదేశాల మేరకు ఎఇ శార్వాణి వంకాయలవాని కోనేరును పరిశీలించారు. చెరువును, ఆయకట్టు పొలాలను పరిశీలించారు. ఆమెతో మాజీ సర్పంచ్, రైతు వెంకటరావు మాట్లాడుతూ షుగర్ ఫ్యాక్టరీ వల్ల వచ్చే జల కాలుష్యంతో చెరువులు కలుషితమవుతున్నాయన్నారు. ఈ నీరు పంట పొలాలకు చేరి పంటలు నాశనమవుతున్నాయని వెల్లడించారు. గతంలో మజ్జి రాముడిపేట, అప్పాపురం గ్రామాల నుంచి కలుషిత నీరుపై పొల్యూషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పరిశీలిస్తున్నారు తప్ప, పూర్తిస్థాయిలో ఫిర్యాదారులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి న్యాయం జరగకుంటే రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రికి, కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎఇ కోనేటి చెరువులో మట్టి, కలుషిత రసాయనిక జలాల నమూనాలు సేకరించారు. జోనల్ కార్యాలయానికి పంపించి నమూనాను ల్యాబ్‌కు తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. ఆ రిపోర్టు ఆధారంగా కర్మాగారంపై తదుపరి చర్యలుఉంటాయన్నారు.



చెరువును పరిశీలిస్తున్న ఎఇ శార్వాణి